క్లుప్తంగా

డాక్టర్ ఏవీ రావుకు వైద్యుల సంఘం అభినందన

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఏ.వెంకటేశ్వరరావుకు ప్రభుత్వ వైద్యుల సంఘం(జీడీఏఏపీ) సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘ సభ్యులు డాక్టర్ శ్యామ్ బాబ్జికుమార్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేశారు. అదే విధంగా జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎస్ ప్రభాకర్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్రీనివాసరావు, డాక్టర్ బి.శ్రీనివాసరావు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఆసిఫ్ ఇంట విషాదం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు షేక్ ఆసిఫ్ ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆసిఫ్ మనుమడు మహ్మద్ రయాన్ హసన్(6) శనివారం ఉదయం అనారోగ్య సమస్యలతో మరణించాడు. ఆసిఫ్ కుమార్తె రేష్మా అల్లుడు అప్సర్‌లు అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. ఇటీవల ఎన్నికల నిమిత్తం విజయవాడకు వచ్చి ఉన్నారు. అయితే మహ్మద్ రయాన్ హసన్‌కు శుక్రవారం జ్వరం రావటంతో వైద్యం చేయించారు. శనివారం ఉదయం ఒక్కసారిగా బాలుడికి ఊపిరి అందకపోవటంతో అప్పటికప్పుడు పాతబస్తీలోని రెండు ఆస్పత్రులకు తీసుకెళ్లినా వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ సలహా ఇచ్చారు. దీంతో హుటాహుటిన మొగల్రాజపురంలోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స చేస్తుండగానే కొద్దిసేపటికే మరణించాడు. మనుమడు మరణించటంతో వారి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు, కార్పొరేటర్లు ఆసిఫ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ట్రాఫిక్ నియంత్రణపై సమీక్ష



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు కూడా ఆయా విభాగాల అధికారులకు సహకరించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు విజయవాడ కమిషనరేట్ పోలీసులు, ట్రావెల్ అసోసియేషన్ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను రోడ్లపై నిలపరాదన్నారు. ప్రజలకు ట్రాఫిక్ సంబంధిత అంతరాయం లేకుండా బస్సులు, కార్లు పార్కింగ్ చేసుకోవాలని లేని పక్షంలో తాము శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రసన్న కుమార్, ఇతర ట్రాఫిక్ సిబ్బంది, ఆంధ్రప్రదేశ్–తెలంగాణ బస్ ఆపరేటర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'మేడ్' రాష్ట్ర మహాసభ కరపత్రం ఆవిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ ఏపీ(మేడ్) ఆధ్వర్యంలో ఈ నెల 9న గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరణ శనివారం జరిగింది. మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ సారథ్యంలో విద్యాధరపురంలోని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రామయ్య మాట్లాడుతూ గత 7 ఏళ్ల నుంచి దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మేడ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లోని దళిత ఉద్యోగుల సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారంపై గుణాత్మక కార్యాచరణ అమలు చేసిన ఘనత మేడ్ సంస్థదేనని చెప్పారు. ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు ఏసీ కాలేజీలో మేడ్ 7వ రాష్ట్ర మహాసభను నిర్వహిస్తామన్నారు. మేడ్ నాయకులు కట్టెనపోగు పున్నారావు, గొడుగు నూరిబాబు, షాలేం రాజు, నలుకుర్తి కిరణ్, కొమ్ము మన్మథకుమార్, శాంతి, పద్మ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు రద్దు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ రెవెన్యూ సహాయకులకు (వీఆర్‌ఏ) కూటమి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు వేస్తోందని, తక్షణమే వాటిని రద్దు చేయాలని, పే స్కేల్ అమలు చేసి ఆదుకోవాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు కోరారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో వీఆర్‌ఏల జీతాల పెంపు, ప్రమోషన్స్ అమలు వంటి అంశాలపై చర్చించి పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ నాలుగో తేదీన కలెక్టరేట్లు, 18వ తేదీన మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వీఆర్‌ఏలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఊర్మిళానగర్ మెయిన్ రోడ్‌లో అధ్వానంగా ఉన్న ఖాళీ స్థలం



42 డివిజన్‌లో చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం



45వ డివిజన్ మిల్క్ కాలనీలో..

ఆరోగ్యాన్ని కబళిస్తున్న ఖాళీ స్థలాలు

- దోమలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారిన వైనం
- మలేరియా, డెంగీ వ్యాధులు విజృంభిస్తాయనే భయం
- పట్టించుకోని వీఎంసీ అధికారులు, స్థల యజమానులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని వివిధ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా మారి, ఆయా ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కబళిస్తున్నాయి. దశాబ్దాల క్రితం తక్కువ రేట్లు ఉన్నప్పుడు కొందరు వ్యక్తులు ఖాళీ స్థలాలను కొని రేట్లు పెరిగినప్పుడు అమ్ముకుందామని వదిలేసిన స్థలాలు ఏళ్ల తరబడి అలానే ఉండిపోయాయి. దీంతో ఆయా ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. అదే విధంగా డ్రెయినేజీ వ్యవస్థ లేని కారణంగా వర్షపు నీళ్లు నిలిచి మురుగు తటాకాలుగా మారాయి. స్థలం ఖాళీగా ఉండటంతో చుట్టుపక్కల నివసించేవారు పడేసే చెత్తా చెదారం, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా ఖాళీ స్థలాలు ఎంత అధ్వానంగా ఉన్నప్పటికీ అసాంఘిక శక్తులు అక్కడికి చేరి స్థానికంగా నివసిస్తున్న వారికి నిద్ర లేకుండా భయభ్రాంతులకు గురి చేయడం పరిపాటిగా మారింది. ఇదేమిటని ప్రశ్నిస్తే ఎదురుదాడులకు దిగుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లల్లోకి వస్తున్న విష సర్పాలు

ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు, విషసర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దోమలు విజృంభిస్తూ నివాసితులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ధాటికి తట్టుకోలేక పోతున్నామని, లేనిపోని రోగాలను కొని తెచ్చుకునే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు బారిన పడి జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. మురుగు తటాకాల్లా మారిన ఖాళీ స్థలాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, అలాగే ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల కారణంగా విషసర్పాలు చేరి రాత్రి సమయాల్లో ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ శానిటేషన్ అధికారులు, సిబ్బందికి ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్య శాఖ అధికారుల చర్యలు శూన్యం

ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారి స్థలాలను శుభ్రం చేయించటం, వాటిల్లో మెరక తోలించుకోవల్సిందిగా నోటీసులు ఇవ్వాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వలనే ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా తయారయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని శుభ్రం చేసుకుని మెరక తోలించుకోవాలని లేని పక్షంలో నగరపాలక సంస్థ స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరిస్తూ నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ఖాళీ స్థల యజమానులు మాత్రం తమ స్థలాలను శుభ్రపరచి మెరక తోలించుకోవాలంటే లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని ముందుకు రాకపోవడం గమనార్హం. అంతే కాకుండా ఖాళీ స్థలాలపై మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజారోగ్య శాఖ అధికారుల చర్యలు శూన్యం కావడం వారు తమతమ ఖాళీ స్థలాలను అలాగే వదిలేస్తున్నారు. వాస్తవానికి ఖాళీ స్థలాల యజమానులు ప్రతి ఏడాది వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉండగా కొందరు మాత్రమే కడుతున్నట్లు తెలుస్తుంది. ఆ విధంగా ఖాళీ స్థల పన్ను చెల్లించేవారి ఎసెస్‌మెంట్ నంబర్, చిరునామా, ఫోన్ నంబర్ స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు తప్పకుండా తెలిసి ఉంటుంది. అయినా ఖాళీ స్థలం చుట్టుపక్కల నివసించేవారు ఫిర్యాదు చేస్తే వారి ఫోన్ నెంబర్ ఉంటే చెప్పండి చర్యలు తీసుకుంటామని చెప్పటం గమనార్హం.

గొల్లపాలెంగట్టు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టండి

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతంలో మరమ్మతులకు గురైన వాటర్ ట్యాంక్ పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు నగరపాలకసంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు. 50వ డివిజన్‌లో పెండింగ్ పనుల పరిశీలన నిమిత్తం నగరపాలకసంస్థ చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రెడ్డిలు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సత్యబాబు డివిజన్‌లోని సమస్యాత్మక ప్రాంతాలు, మధ్యలో నిలిచిపోయిన పనులను చూపించి వెంటనే వాటిని పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా వాటర్ రిజర్వాయర్ మరమ్మతు పనులతో పాటు జెండా చెట్టు వీధిలో కమ్యూనిటీ హాల్, నూకాలమ్మ గుడి వద్ద రిటైనింగ్ వాల్, తాడిపైడయ్య వీధిలోని రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలు, జాడ పాపయ్య వీధిలో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు డివిజన్ వ్యాప్తంగా తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రాజు, సీహెచ్ దుర్గారావు, జి.నాగ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై ఫిర్యాదులు రాకుండా పని చేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యలపై ఫిర్యాదులు రాకుండా అధికారులు, సిబ్బంది పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఆదేశించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ఆయన నగరంలోని వార్డు సచివాలయాల ప్రణాళిక, శానిటరీ, ఎమినిటీస్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు వారాలుగా చేస్తున్న సంయుక్త పర్యవేక్షణలో సెక్రటరీలు గుర్తించిన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ, సచివాలయాల ఉద్యోగులు సంయుక్తంగా ఆయా సచివాలయాల పరిధిలో నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. సంయుక్త పరిశీలన చేస్తున్నప్పటికీ ప్రజలకు ఇంకా సమస్యలు ఎందుకు ఎదరవుతున్నాయన్న విషయంపై విశ్లేషించారు. నగరపాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిళ్లలోనూ ఒక్కో సర్కిల్‌కి ఒక సచివాలయం బృందంతో చేసిన సంయుక్త పరిశీలనలో ఏమి గమనించారు, ఎటువంటి సమస్యలను పరిష్కరించారు, ప్రజల స్పందన ఎలా ఉంది అన్న అంశాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.

సమన్వయంతో పని చేయాలి

అనధికార కట్టడాలు, ఖాళీ స్థలాలు, వ్యర్థాలను ఇంటి వద్దే వేరు చేయడం వంటి విషయాలపై కమిషనర్ ధ్యానచంద్ర సెక్రటరీలతో చర్చించారు. ప్లాన్ లేనిదే ఇల్లు కట్టకూడదని, ఖాళీ స్థలాలలో వ్యర్థాలను పడేయకూడదని, తడి – పొడి చెత్తను సెగ్రిగేషన్ చేయడం అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సెక్రటరీలకు సూచించారు. సచివాలయ ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేస్తే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించగలరని చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న ప్రజల సమస్యలపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, ఈఈలు, డెప్యూటీ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, ఏఈలు, సచివాలయం స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

6లోగా పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు దరఖాస్తును స్వీకరిస్తున్న శివారెడ్డి, విద్యాసాగర్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా, గుంటూరు జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి జరగనున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులైన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ నెల 6వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పిలుపునిచ్చారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో భాగస్వాములు కావాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకొనేందుకు గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్ నందు పశ్చిమ కృష్ణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పరిశీలించారు.

ప్రజాస్వామ్యం పరిరక్షణకు ఓటు వజ్రాయుధం

అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం పరిరక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. పట్టభద్రులైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఓటరుగా నమోదు చేసుకొని మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు. ఎన్జీవో హోమ్‌లలో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కోశాధికారి కె.రంగారావు, జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ రెడ్డి, పి.రమేష్, జి.రామకృష్ణ, ఎం.నాగేంద్ర, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సీవీఆర్ ప్రసాద్, షేక్.నాజీరుద్దీన్, వీవీ ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆది దంపతులకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు శనివారం పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన ఎంఎస్ఎం స్వాత్విక శిష్యబృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా కార్తిక మాసోత్సవాల ప్రారంభం



శ్రీహనుమత్ దీక్షా పీఠంలో పూజలు నిర్వహిస్తున్న స్వామిజీ




విశేష అలంకరణలో అర్ధనారీశ్వర స్వామివారు



వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆకాశదీపం

- ఆలయాల్లో కార్తిక శోభ
- స్వామి వార్లకు విశేష అభిషేకాలు
- పలు ఆలయాల్లో ఆకాశ దీపాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో కార్తిక మాసోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. చిట్టినగర్‌లోని పలు శివాలయాలలో విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శమీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆకాశ దీపాన్ని వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు కార్తిక మాసం విశిష్టతను, కార్తిక దామోదరుడి గురించి భక్తులకు వివరించారు. భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌లు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగించగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తిక దామోదరుడికి విశేష పూజలు జరిపారు.



రజితకవచాలంకృత పార్వతీదేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు

హోమాలకు అంకురార్పణ

శ్రీహనుమత్ దీక్షా పీఠంలోని శ్రీలలితా గౌరీ సమేత నాగలింగేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక శివ పంచామృత అభిషేకాలు, రుద్ర యాగం, కార్తిక మాస హనుమత్ దీక్షల స్వీకరణ జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలోని నాగలింగేశ్వర స్వామి వారికి పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం యాగశాలలో హోమాలను అంకురార్పణ చేశారు. అనంతరం పలువురు భక్తులకు దీక్షదారణ చేశారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో వేం చేసిన శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం, శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి సన్నిధిలో కార్తిక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.

పాత శివాలయంలో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో కార్తిక మాసోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో జరుగుతున్న నక్త దీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో వివిధ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలను వైభవంగా చేపట్టారు. అమ్మవారి రజితకవచాలంకృత పార్వతీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి త్రిశతి ఖడ్గమాల, సహస్రనామార్చన, శ్రీ మల్లేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు అనంతరం చతుర్వేదస్వస్తి, ఆశీర్వచనం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి వారి సన్నిధిలో దీక్షపరులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వరద బాధితులకు 'ఆటా' సాయం



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో ఇటీవల సంభవించిన బుడమేరు వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులకు అమెరికా తెలుగు అసోసియేషన్(ఆటా) వస్త్రదానం చేసింది. విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో సంఘం సభ్యులు మధు బొమ్మినేని, జయంత్ చల్ల, ఆళ్ల రామకృష్ణా రెడ్డి, భాను స్వర్గం ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో జీఎస్సార్ హైస్కూల్‌తో పాటు జక్కంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాధితులైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆటా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. మున్నెన్నడూ లేని విధంగా అకస్మాత్తుగా ముంచుకొచ్చిన వరద ముంపునకు గురి కావడం బాధాకరమని పేర్కొన్నారు. ఎక్కడో ఉన్న తాము వరద ముంపు దృశ్యాలను ప్రసార మాధ్యమాల్లో చూసి చలించిపోయామని, ఇక స్వయంగా నరక యాతన అనుభవించిన బాధితుల పరిస్థితి వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్పీ రామరాజు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, కార్యదర్శులు ఐజాక్ న్యూటన్, చెరుకు లక్ష్మి నరసింహారావు, పాఠశాలల హెచ్ఎంలు రవి కుమార్, పద్మావతి, ఆటా ప్రతినిధులు సూర్యచంద్రరెడ్డి, అమృత్ ముళ్లపూడి, లోహిత్ కుమార్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ



సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

భవానీపురం గొరిలదొడ్డి వద్ద క్రైస్తవ శ్మశానవాటిక ఆవరణలో సమాధుల పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు శ్మశానవాటికకు తరలివచ్చి సమాధుల వద్ద పుష్పాలు ఉంచి, దీపాలు వెలిగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



దుర్గా ఘాట్‌లో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



జల్లు స్నానాలు చేస్తున్న భక్తజనం



పాత శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తికం.. ఆధ్యాత్మికం

కార్తిక మాసోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని భక్తులు శనివారం ఉదయాన్నే కృష్ణానదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పాతబస్తీలోని పాత శివాలయంతో పాటు పలు ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. దీంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ